www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 12 ఆగస్టు 2024

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -మామిడికుదురు

లూటుకుర్రు హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లూటుకుర్రు హైస్కూల్ 1984-85 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆనాటి మధురస్మృతుల గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. ఆనాటి చదువులు నేర్పిన గురువులను సత్కరించారు. కుటుంబ సభ్యులతో కలిసి సహఫ ంక్తి భోజనం చేశారు. ప్రస్తుతం వారి పరిస్థితి చేసే ఉద్యోగము, కుటుంబ పరిచయాలతో పాఠశాల ఆవరణ సందడిగామారింది.



గురువులతో లూటుకుర్రు హైస్కూల్ పూర్వవిద్యార్థులు

ఆక్రమణల చెరలో మేజర్ డ్రెయిన్

- మైనర్‌గా దర్శనమిస్తోన్న మేజర్ డ్రెయిన్
- డ్రెయిన్‌పై విరుద్ధ కట్టడాలతో పారని మురుగు, చెత్త
- వర్షం పడితే ముప్పేట ముంచుతున్న ముంపు
- ఆక్రమణలను అదుపు చేయడంలో అధికారుల విఫలం

ప్రజాశక్తి-రాజోలు

జాతిపిత మహాత్మా గాంధీ నడయాడిన నేల.. స్వాతంత్ర సమరానికి.. సై అంటూ ఉద్యమంలో పాలు పంచుకున్న యోధులకు పురిటిగడ.. సుందరమైన సినిమాలో లొకేషన్లు .. ఇలా ఎంతో ప్రాముఖ్యత కలిగిఉంది. రాజోలు నియోజకవర్గం. అయితే నియోజకవర్గ కేంద్రం రాజోలుకి సక్రమమైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదు.దీంతో మురుగు, చెత్త వెళ్లే దారి లేని పరిస్థితి నెలకొంది.

మురుగు పారేందుకు ఉన్న ఒక్క డ్రెయిన్ ఆక్రమణ

మురుగు పారేందుకు ఉన్న ఒక్క డ్రెయిన్ ఆక్రమణలకు గురై బక్కచిక్కి పోయింది. విరుద్ధ కట్టడాలతో మురుగు, చెత్త వెళ్లే వీలు లేక అధ్వానంగా మారింది. రాజోలు నియోజకవర్గ కేంద్రం రాజోలు గ్రామానికి ప్రధానమైన మురికి కాలువ సోంపల్లి మేజర్ డ్రెయిన్ పరిస్థితి అస్తవ్యస్థంగా ఉంది. కొందరి అక్రమణల చెరలో కొట్టుమిట్టాడుతోంది. మురుగు నీరు ముందుకు పారక రాజోలు గ్రామంలో ఉన్న ప్రజలు, వేలాది ఎకరాల వరిసాగు చేస్తున్న రైతులు ముంపు బారిన పడుతున్నారు. మురుగు బయటకు పారేందుకు వీలుగా డ్రెయిన్ లేకపోవడంతో మేజర్ డ్రెయిన్. పరిస్థితి మేజర్ సమస్యగా మారింది. రాజోలు ప్రభుత్వ కాలేజీ పరిసరాల నుంచి ప్రారంభమై.. రాజోలు చేతి పర వరకు డ్రెయిన్ ఉంది. ప్రస్తుతం దాని విస్తీర్ణం, వెడల్పు వంటివి పరిశీలిస్తే.. మొత్తం డ్రెయిన్ ఆక్రమణల్లో ఉందని చిన్న పిల్లలకు సైతం ఇట్టే అవగతం అవుతుంది.

ముంపుతో ముప్పేట దాడి

నీరు పారే వీలులేక కొద్దిపాటి వర్షానికే రాజోలు ముంపునకు గురౌతోంది. చిన్నపాటి చినుకులకే కాలనీలన్నీ జలమయం అవుతున్నాయి. రహదారులపై నీరు నిల్వ ఉండిపోయి పాడైపోతున్నాయి. పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు వెంటాడుతున్నాయి. నియోజకవర్గ ముఖ్యకేంద్రం రాజోలులో ఉన్న ఈ మేజర్ డ్రెయిన్ ప్రధాన సమస్యపై నూతనంగా ఎన్నికైన రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ దష్టి సారించి.. ఏళ్ల తరబడి ఉన్న నాటి సమస్యకు పారిష్కరం చూపాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



మురుగుపారక అధ్వానంగా ఉన్న డ్రెయిన్

అక్రమ కట్టడాలతో.. ఆటంకం

మురుగు నీరు పారేందుకు వీలు లేకుండా ఎవరి నివాసాల ఎదుట వారు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా వంతెనలు, సిమెంట్ బ్రిడ్జిలు, సిమెంటు తూములు ఏర్పాటు చేసుకోవడం తో మురుగు నీరు ఎటూ పారక మొత్తం డ్రెయిన్ దారుణంగా పరిణమించింది. డ్రెయిన్‌ను ఆనుకుని ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి బలమైన కట్టడాలు మురుగు నీటి పారుదలకు ఆటంకంగా మారాయి. పలుసార్లు సర్వే పేరుతో అధికారులు ఆక్రమార్కులకు ముచ్చెమటలు పట్టించకపోగా. సర్వే కొలతల్లో తలలు పట్టుకుంటున్నారు. దీంతో రాజకీయ అండదండలతో మేజర్ డ్రెయిన్ అంటే సుమారు 4 మీటర్ల వెడల్పు ఉండాల్సిన డ్రెయిన్ ఆక్రమణలు వంతెనలు, కాలి బాటలు, ప్రహరీల నిర్మాణంతో 1 మీటరు వెడల్పుతో ఉంది. దీనిబట్టి చూస్తే ఆక్రమణ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఉదాహరణకు కొన్ని భవనాల ఎదుట డ్రెయిన్‌కి బ్లు కూడా వేసేశారు. మరి ఏ అధికారి అనుమతి ఇచ్చారో తెలియదు. ఇలాంటి దారుణాలు డ్రెయిన్ పొడవునా కనీసం మూడేసి మీటర్లకు ఒకటైనా దర్శనమిస్తున్నాయి. ఎవరిని ఏమన్నా సంబంధిత ఆక్రమణదారుడు ఎలాంటి రాజకీయ ప్రోద్బలంతో ముందుకోస్తారో అన్న భయం డ్రెయిన్ అధికారుల్లో ఉంది. డ్రెయినేజీ పనుల సర్వే లో ఆక్రమణలు పూర్తి స్థాయిలో తొలగిస్తారో? లేక అక్రమార్కుల పైరవీలతో వెనుతిరుగుతారో అన్న అనుమానం రాజోలు ప్రజలలో ఉంది.

వర్షం పడితే పొలాల్లో మురుగే

రాజోలు లో కొద్దిపాటి వర్షాలకే లోతట్టు ప్రాంతాలన్నీ ముంపునకు గురౌతూ నీట మునుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం మేజర్ డ్రెయిన్ ఆక్రమణలకు గురికావడమే ప్రధాన కారణం. అలాగే ఈ డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న వందలాది ఎకరాల వరిచేలలో ముంపు నీరు దిగక పంట పొలాలు నాశనం అవుతున్నాయి. రాజోలు మండలంలో పంచాయతీ పరిధిలో చిన్న మురుగు కాలువలన్నీ ప్రధాన మేజర్ డ్రెయిన్‌కు అనుసంధానమై ఉంటాయి. దీంతో వర్షాకాలంలో వర్షాలకు డ్రెయిన్లు అన్నీ నీట మునగడంతో మేజర్ డ్రెయిన్‌లో మురుగు పారకపోవడం వల్ల గ్రామం మొత్తం ముంపునకు గురౌతుంది. దీంతో కాలనీలు అన్ని అపారిశుధ్యంతో దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఆక్రమణలకు గురైన రాజోలు మేజర్ డ్రెయిన్

మొత్తం డ్రెయిన్ స్థలమే

ఆధునికీకరణలో భాగంగా నిర్వహించిన సర్వే లో సంబంధింత అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న రహదారి చుట్టుపక్కల నిర్మించిన భవనాల సైతం సంబంధిత డిపార్ట్‌మెంట్ స్థలంలోకి ఉండటంతో అధికారులకు ఏమీ తోచడం లేదు. ఏ నిర్మాణం తొలగిస్తే ఏ సమస్య ఎదురౌతుందోనని అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలోను ఈ డ్రెయిన్ ఆధునికీకరణకు నిధులు మంజూరు అయినప్పటికీ గుత్తేదారులు ముందుకు రాకపోవడం తో ఆ నిధులు మరలా వెనక్కి మరిలాయి దీంతో డ్రెయిన్ నిర్మాణం కలగా మిగిలింది. ఆక్రమణలు తొలగించి పూర్తి స్థాయిలో ఆధునికీకరణ చేస్తేనే ముంపు సమస్యకు పరిష్కారమవుతుందని రాజోలు ప్రజలు వేచి చూస్తున్నారు. దీనిపై ప్రస్తుత ఎంఎల్ఎ చర్యలు తీసుకుంటారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

డ్రెయిన్ ఆధునికీకరణ చేపడతాం



పరిసరాలను చక్కదిద్ది.. ఎప్పటి కప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టి ప్రజారోగ్యం కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు డ్రెయిన్లకు ఎప్పటికప్పుడు పూడిక తీయించి కాలనీలను చక్కదిద్దే కార్యక్రమాలు చేపడతాం. అందుకు ముందుగా డ్రెయిన్లపై సర్వే చేయిస్తాం. ఎక్కడైనా ఆక్రమణలకు గురైతే చర్యలు తీసుకుంటాం. డ్రెయిన్ ఆధునికీకరణ చేపట్టి పరిస్థితి చక్కదిద్దుతాం.

- దేవ వరప్రసాద్,ఎంఎల్ఎ, రాజోలు

చేనేత రంగం అభివృద్ధికి కృషి

మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

చేనేత రంగాన్ని అభివృద్ధిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు తన వంతు సహకారం అందజేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆయన రామచంద్రపురం మండలం లోని ఆదివారపుపేట గ్రామంలో గల చేనేత సంఘ కార్మికులు ఏర్పాటు చేసిన క్లస్టర్ డేవలప్మెంట్ కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన చేనేత పరికరాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశామన్నారు. చేనేత కార్మికులకు తాను ఎంతో రుణపడి ఉంటానని చేనేత రంగాన్ని అభివద్ధి చేసే దిశగా రాష్ట్రంలోనే ఆదివారపుపేట గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చేనేత కార్మికులు పడుతున్న కష్టానికి అతి త్వరలోనే ఉపాధి కల్పించేలా ఒక ప్రత్యేకమైన మార్గం చూపిస్తానన్నారు. మూతపడిన మగ్గాలకు త్వరలోనే మంచి రోజులు వస్తాయని తెలిపారు. అదేవిధంగా నేతన్నలకు అవసరమైన ఇన్సూరెన్స్ కార్డుల కోసం ఒక ప్రణాళిక సిద్ధం చేసి వారికి ఆరోగ్య భద్రతను కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని చేనేత మగ్గాలను మంత్రి పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు, అభిమానులు చేనేత సంఘం కార్మికులు పాల్గొన్నారు.



ఆదివారపుపేటలో మగ్గాలను పరిశీలిస్తున్న మంత్రి

'పిచ్చుకలంక' అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని బొబ్బర్లంక పంచాయతీ పరిధిలోగల పిచ్చుకలంక ప్రాంతాన్ని పర్యాటక రంగ ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యల చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. ఆదివారం వివిధ శాఖలు పర్యాటక రంగ అధికా రులతో కలిసి ఇప్పటికే జల వన రుల శాఖ అధికారులు పర్యాటక రంగ అభివద్ధికై అప్పగించిన స్థలం 56 ఎకరాల విస్తీర్ణాన్ని ఆయన పరిశీలించారు. అప్రోచ్ రోడ్లు , రాకపోకలు అవకాశాలు కేటా యించిన భూమి స్వభావం స్థితిగతులు, సుస్థిరతలపైన, పర్యాటక రంగ అభివృద్ధికి గల అవకాశాలపై సంబంధిత అధికా రులతో చర్చించారు. మ్యాప్ ల ఆధారంగా సరిహద్దులను అడిగి తెలుసుకున్నారు. పిచ్చుక లంక ప్రాంత అభివద్ధికి త్వరలో పర్యా టక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వపరంగా సన్నాహాలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు కార్యక్రమంలో తహశీల్దార్ రాజేష్, జలవనరుల శాఖ సహాయ ఇంజినీర్ పిల్లా సత్యనారాయణ, కోనసీమ జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి అశోక్ ప్రతాపరావు, రెవెన్యూ పర్యాటక జలవనుల శాఖ అధి కారులు రెవెన్యూ సర్వేయర్లు పాల్గొన్నారు.



పిచ్చుకలంక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నేడు మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాకు రాక

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రాష్ట్ర పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 12న సోమవారం జిల్లాకు రానున్నారని సివిల్ సప్లయి అధికారులు ఆదివారం ఒక ప్రకటనలోతెలిపారు. రబీ ధాన్యం బకాయిలకు సంబంధించి రూ.154.63 కోట్లు స్థానిక కలెక్టరేట్ నందు సాయంత్రం నాలుగు గంటలకు మెగా చెక్కును మంత్రి నాదెండ్ల మనోహర్ విడుదల చేయనున్నారని తెలిపారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-ఆలమూరు

ఉపాధ్యాయ సంఘాల కోరిక మేరకు కాలయాపన చేయకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో సిపిఎస్ రద్దు చేయాలని యుటిఎఫ్ ఆలమూరు మండల శాఖ డిమాండ్ చేసింది. మండల కేంద్రంలోని యుటిఎఫ్ హోమ్ లో ఆదివారం యుటిఎఫ్ ఆవిర్భావ స్వర్ణోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా నేతలు జెండా ఆవిష్కరించారు. ఆలమూరు మండల యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు జి.భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో చలో కాకినాడ కార్యక్రమం విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ ఉద్యమ పితామహులు అప్పారి వెంకటస్వామి, వి.సూర్యనారాయణ రాజు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా నాయకులు వైవివి.రమణ మాట్లాడుతూ 2019 సాధారణ ఎన్నికల ముందు యుటిఎఫ్ ఇతర సంఘాలు చేసిన ఆందోళన ఫలితంగా టిడిపి ప్రభుత్వం టక్కర్ కమిటీని వేసిందన్నారు. ఎన్నికల్లో వైసిపి గెలవడంతో అప్పటి ముఖ్యమంత్రి, ఇప్పటి ప్రతిపక్ష నేత జగన్ నేను అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. దానికి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేస్తే ఆయా నాయకులపై కక్ష సాధింపు చర్యలలో భాగంగా కేసులు నమోదు చేశారన్నారు. ఈ విధంగా ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేయడంతో ఉపాధ్యాయుల నిరసనకు వైసిపి ప్రభుత్వం గురి కావాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుత ఉమ్మడి ప్రభుత్వంతో కూడా సిపిఎస్ పై చర్చల ద్వారా కాలయాపన చేయడం సరైన విధానం కాదన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 10న అమలాపురంలో జరిగిన సభలో కార్యాచరణ కోసం యుటిఎఫ్ పిలుపు ఇచ్చిందన్నారు. అందుకే కాకినాడ సభను తప్పక విజయవంతం చేయవలసిన అవసరం ఉందని ఉద్యోగ, ఉపాధ్యాయులుకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అధ్యక్షుడు కెవిఆర్.బాపూజీ, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జె.మనోజ్‌కుమార్, బి.లోకేష్, శ్యామల, సత్యవేణి, ఎన్.శ్రీనివాసరావు, పివివిజిఎస్ఎన్.మూర్తి, గిడ్డు ప్రకాశం, ఎం.అబ్బులు, తదితరులు పాల్గొన్నారు.




ఆలమూరులో యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ వద్ద మాట్లాడుతున్న నేతలు

చిన్నారులకు కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలం ర్యాలి గ్రామంలోని అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో పేద చిన్నారులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను అనూస్ హోమ్ వద్ద అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకాంత్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని చిన్నారులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఇవ్వాలని ఉద్దేశంతో ఈ శిక్షణ తరగ తులు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఫిజియో థెరపిస్ట్ మోహిత్, ఉపాధ్యాయులు శ్యామ్ కుమార్, తేజశ్రీలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అప్పాజీకి ఇండియన్ ఐకాన్ పురస్కారం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమలాపురం పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు చొల్లంగి అప్పాజీ చేసిన సేవల లను గుర్తించి ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ ఐకాన్ 2024 అవార్డు అందుకున్నట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరం ధర్మంచర కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో అప్పాజీకి ఈ అవార్డును రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రదానం చేశారు. మంత్రి మాట్లాడుతూ రా అప్పాజీ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జర్నలిస్టుగా అనేక కార్యమాలు చేసిన అప్పాజీ భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షులు అద్దంగి రాజా, కవి కత్తిమాండ ప్రతాప్, నర్సీపల్లి హారిక, గుబ్బల రాంబాబు తదితరులు అప్పాజీని అభినందించారు.



అవార్డు స్వీకరిస్తున్న అప్పాజీ

సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

కార్మికుల, కర్షక సమస్యలను గుర్తించి, పరిష్కరించడంలో ట్రేడ్ యూనియన్ ఎప్పుడూ అండగా నిలుస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. చిన కొత్తలంక పంచాయతీ పరిధిలోని సత్తెమ్మ గుడి ప్రాంతంలో ఆదివారం గణేష్ కొబ్బరికాయల లారీ ఎగుమతి, దిగుమతి జట్టుకూలీ సంఘం సమావేశం నిర్వహించార. ముఖ్య అతిథిగా విచ్చేసిన దుర్గాప్రసాద్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు డిమాండ్లపై చర్చించారు. ముఖ్యంగా కొబ్బరి ఎగుమతి, దిగుమతి జట్టు సంఘాలకు నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని 15 రోజుల క్రితమే కొబ్బరి వ్యాపారులకు డిమాండ్ నోటీసు పంపామన్నారు. ఇప్పటికీ వ్యాపారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా వ్యాపారులు స్పందించాలని లేని పక్షంలో కార్మికులు సమ్మెకు వెనుకాడరన్నారు. గత వేతన ఒప్పందం ముగిసి ఏడాది దాటినా వ్యాపారులు నూతన వేతన ఒప్పందం అమలు చేయడంలో కాల యాపన చేయడం తగదన్నారు. నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ఎన్నికైన నూతన కొబ్బరి ఎగుమతి, దిగుమతి కార్యవర్గం

కొబ్బరి ఎగుమతి, దిగుమతి సంఘ కార్యవర్గం ఎన్నిక

అనంతరం కొబ్బరి ఎగుమతి, దిగుమతి సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా జి .దురా ప్రసాద్, అధ్యక్షునిగా రాయుడు సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జి.అగ్గి రాముడు, జి.తాతారావు ప్రధాన కార్యదర్శిగా ఆచంట ఆదినారాయణ, సహాయ కార్యదర్సులుగా యడ్ల దుర్గా ప్రసాద్, పశ్చిమాల రమణ, కోశాధికారిగా గొల్లపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా రెడ్డి సత్యనారాయణ, కటికదల సత్యనారాయణ, గుత్తుల నాగబాబు, మధుర వెంకటరమణ, గుత్తుల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో అర్జున్ రావు, కార్మికులు పాల్గొన్నారు.

వర్గీకరణపై తీర్పును ఉపసంహరించుకోవాలి

ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాజ్యాంగ విరుద్ధంగా ఎస్‌సిలను వర్గీకరిస్తూ సుప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే ఉపసంహరించుకోవాలని ముమ్మిడివరం ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కాశి వాని తూము సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం మండల మాల మహానాడు ఆధ్వర్యం లో ఎస్‌సి వర్గీకరణను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి కాశి మునికుమారి, దేవరపల్లి ఏడుకొండలు, మెండి కృష్ణ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ రహదారి 216 పై నిరసన వ్యక్తం చేస్తూ పెద్దవంతెన, హైస్కూల్ సెంటర్, బస్ స్టాండ్ సెంటర్, బల్లగేటు సెంటర్, పోలీస్ స్టేషన్ సెంటర్ల మీదుగా తహశీల్దార్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహం వరకు శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించారు. పలువురు నిరసన కారులు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341,342 కు వ్యతిరేకంగా కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాలు కుట్రపూరితంగా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతూ, కులాల ఐక్యతకు భంగం కలిగించే విధంగా చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వర్గీకరణ చేసే హక్కు కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉందన్నారు. ఎస్‌సి వర్గీకరణపై 2005లో సుప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పును పరిగణలోకి తీసుకోపోవడం చూస్తే, నేటి తీర్పు రాజకీయ కుట్రలో భాగమేనని దుయ్యబట్టారు.ఈ నిరసన ర్యాలీలో నిరసన కారులు వుయ్ వాంట్ జస్టిస్, వర్గీకరణ వద్దు-ఐక్యతే ముద్దు అంటూ నినాదాలు చేశారు.అనంతరం బుద్ధ పార్క్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం పెట్టారు. కార్యక్రమానికి ముందు మాల మృత వీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని 1997లో మాల మహానాడు పిలుపు మేరకు చలో అసెంబ్లీ ముట్టడిలో పాల్గొన్న మాలలపై అప్పటి సిఎం చంద్రబాబు గుర్రాలతో తొక్కించిన, వాటర్ కేన్లతో బాష్పవాయువులు ప్రయోగిం చిన ఘటనలో అమరులైనవారికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాశి జగపతి రావు, ముంగడ ఆశీర్వాదం, మట్టా రాహుల్ , ఇసుకపట్ల వెంకటేశ్వర రావు, కాశి లాజర్, పంతగడి నరసింహ మూర్తి కాశి రామకృష్ణ, అంబేద్కర్ యువజన, విద్యార్థి, ప్రజా, అభ్యుదయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

బకాయిలు అందక రైతుల అవస్థ

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కామన ప్రభాకరరావు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అయిదు నెలల కిందట ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలకు సొమ్ములు నేటి వరకు చెల్లించలేదని, దీనీ వల్ల రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కామన ప్రభాకరరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌలు రైతులు అనేక చోట్ల బంగారం పైనా, వడ్డీ వ్యాపారుల దగ్గర అధిక వడ్డీ లకు అప్పులు చేసి అమ్మిన ధాన్యం సొమ్ములు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అవుతోంది కాని ఇప్పటివరకు రైతులకు చెల్లించవలసిన సొమ్ములు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకొనే కూటమి ప్రభుత్వం ఎందుకు రైతుకు డబ్బులు చెల్లించడంలేదని ప్రశ్నించారు. ఒక పక్క రైతులు మొదటి పంటకు నారుమడులు వేసుకుని నాట్లు నాటగా భారీ వర్షాలు కురిసి నాట్లు దెబ్బతిన్నాయన్నారు. అయినా దీనిపై ప్రభుత్వం ఏవిధమైన సహాయం చేయకపోగా అమ్మిన ధాన్యానికి సొమ్ములు నేటివరకు చెల్లించలేదన్నారు. తక్షణం రైతులకు చెల్లించవలసిన సొమ్ములు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే నాట్లు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



బండారు కాలనీకి వెళ్లే దారిలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

మురుగు నీటిలోనే రాకపోకలు

డ్రెయినేజీ లేక ఇబ్బందులు పడుతున్న బండారు కాలనీ వాసులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం బస్టాండ్ సెంటర్ నుండి బండారు కాలనీలో వెళ్లే రోడ్డులో డ్రయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. మురుగు నీటిలోని బండారు కాలనీవాసులు రాకపోకలు సాగించవలసిన దుస్థితి ఏర్పడింది. అలాగే కుమ్మరిపేటలో రోడ్లు పల్లంగా ఉండడంతో మురికి నీరు రోడ్లపై చేరుతోంది. ఈ సమస్య కొన్ని సంవత్సరాలుగా ఉంటున్న పంచాయతీ పాలకులు కానీ అధికారులు కానీ పట్టించుకోకపోవడం శోచనీయం. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధుల వద్దకు పంచాయతీ మండల అధికారులకు ఈ సమస్యపై విన్నవించుకున్నా వారు పట్టించుకున్న దాఖలాలు లేవని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. పంచాయతీలో ఎంతమంది పాలకులు మారిన ఆత్రేయపురంలోని గ్రామ ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదు. అధికారులు మాత్రం రోడ్ల అభివద్ధి చేసేందుకు చేస్తున్న ప్రతిపాదనలు కాగితాలకి పరిమితం అవుతున్నాయి.



పాశర్లపూడి లంకలో జాతీయ పతాకంతో డ్వాక్రా మహిళల ప్రదర్శన

జాతీయపతాకంతో మహిళల ప్రదర్శన

ప్రజాశక్తి-మామిడికుదురు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాశర్లపూడి లంకలో ముందస్తుగా ఆదివారం సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు జాతీయ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు త్రివర్ణ ప్రతాకాలతో వందేమాతరం వందేమాతరం అంటూ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమం లో సర్పంచ్ తెల్లగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపిటిసి సభ్యులు చెరుకూరి పార్వతీ సత్తిబాబు, డ్వాక్రా యానిమేటర్లు నాగమణి, అనూష డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఆగస్టు 12 సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థానిక కలెక్టరేట్లో గోదావరి భవన్ నందు ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదా రులు తమ తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి తగు పరిష్కార మార్గాలు పొందాలని ఆయన ప్రకటనలో అర్జీదారు లకు విజ్ఞప్తి చేశారు.

నేరాలు ఘోరాలు

భార్యను గాయపర్చిన భర్తపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

భార్యతో గొడవపడి గాయపరిచిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామానికి చెందిన చేబోలి ఉమాదేవికి 2007లో ఆయినవిల్లి మండలం మాగం గ్రామానికి చెందిన చేబోలి శివశేఖర్ రాజుతో వివాహం అయింది. వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. జీవిత కాలంలో వీరిద్దరి మధ్య మనస్పర్ధలు పెరిగి తరచూ గొడవలు పడుతున్నారు. సుమారు సంవత్సరం క్రితం ఉమాదేవి పుట్టింటికి వచ్చేసింది. అప్పటినుంచి ఆత్రేయపురంలో ఉంటోంది. ఈనెల 9న భర్త శేఖర్ రాజు ఆత్రేయపురం వచ్చి భార్య ఉమాదేవితో గొడవ పడి ఆమెను బెదిరించి చాకుతో గాయపరిచాడు. ఉమాదేవిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న సారా సామత్రితో సిబ్బంది

3,500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతానగరం

తూర్పు గోదావరి జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు నార్త్ జోన్ డిఎస్పి, కోరుకొండ సిఐ పర్యవేక్షణలో సీతానగరం ఇన్‌ఛార్జి ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్ సిబ్బందితో కలిసి గరగలం పాలెం గ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున సారా బటీలపై దాడులు చేసి 200 లీటర్లు నాటు సారా, రెండు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా కాస్తున్న ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు. వారిపై కేసులు నమోదు చేశామన్నారు.


పాడైన కోటిపల్లి-యానాం ఏటిగట్టు రోడ్డు

ప్రమాదాలకు నిలయంగా ఏటిగట్టు

ప్రజాశక్తి-రామచంద్రపురం

గోదావరి ఏటి గట్టు పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా పరిణమించింది. మూడు నెలలుగా మరింత పెద్దదిగా మారి చెరువును తలపిస్తోంది. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుని ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. కె.గంగవరం మండలంలోని కోటిపల్లి గోదావరి ఏటిగట్టు రోడ్డు యానం వరకు అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాతకోట వద్ద రైల్వే లైన్ వెళ్లే గట్టుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో గోదావరి వచ్చే సమయంలో మరింత ప్రమాదం పొంచి ఉంది. ఈ గొయ్యిని మూడు నెలలుగా ఎవరో పట్టించుకోకపోవడంతో నిత్యం ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సమ్మర్పల్లి వైపు ఇసుక మూటలు వేసిన అధికారులు పాతకోట వైపు పడ్డ ఈ ఏటిగట్టు గొయ్యిని నేటికీ పూడ్చకపోవడంతో రాత్రి సమయాల్లో ఈ గట్టుపై ప్రయాణించాలంటే ప్రయాణికులకు భయపడుతున్నారు. ఇక్కడ ప్రయాణించాలంటే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కోటిపల్లి నుంచి యానాం వరకు సుమారు 20 కిలోమీటర్లు పొడవైన రహదారి ఆధునీకరించాల్సిన ఉంది. దీనిపై అధికారులు వెంటనే స్పందించి పాతకోట గ్రామం వద్ద ఏర్పడిన ఏటిగట్టు గొయ్యిని వెంటనే పూడ్చాలని, లేకుంటే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉందని ప్రయాణికులు కోరుతున్నారకు. దీనిపై అధికారులు స్పందించి ఈ భారీ గొయ్యిని పూడ్చాలని ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


మంత్రి సుభాష్‌ను సత్కరించిన బాస్కెట్బాల్ అసోసియేషన్

'బాస్కెట్ బాల్' పూర్వవైభవానికి ప్రభుత్వ సహకారం

ప్రజాశక్తి -రామచంద్రాపురం

రాష్ట్రంలో బాస్కెట్‌బాల్ క్రీడకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వ సహకారం అందజేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ 2024-25 సంవత్సరాల్లో బాస్కెట్ బాల్ గేమ్ అభివద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఆదివారం స్థానిక రాజగోపాల్ థియేటర్ మినీ ఫంక్షన్ హాల్లో రిటైర్డ్ డిఎస్‌పి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జి.మదన్ మోహన్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ బాస్కెల్‌బాల్ క్రీడాభివద్ధికి ప్రభుత్వం కషి చేస్తుందని వివరించారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు మంత్రి సుభాష్‌ను సత్కరించారు. సమావేశంలో మారిశెట్టి సత్యనారాయణ, టివిఎస్.రంగారావు, కె.పురుషోత్తం రావు, ఎ.రామచంద్రరావు, బిటి.వర్మ, ఎన్‌వివి.శ్రీనివాసరావు, అవినాష్, ఖాసీంఖాన్, ఎన్‌డి.శ్రీనివాస్, తదితరులుపాల్గొన్నారు.

లంపీ స్కిన్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

పశు సంవర్ధక శాఖ జెడి ప్రకాశరావు





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పశువులకు సోకే అతి ప్రమాదకరమైన లంపీ స్కిన్ వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు తెలిపారు. జిల్లాలో పశు సంపదను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో 76,502 ఆవులు, 2,82,273 గేదెలు, 1,41,229 గొర్రెలు, 1,01,870 మేకలు, 32,48,636 కోళ్ళు ఉన్నాయన్నారు. పశువులకు బీమా, వ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

లంపీ స్కిన్ వ్యాధి ఎక్కువగా ఏ జాతి పశువుల్లో సోకుతుంది

ఈ వ్యాధి అధికంగా తెల్లజాతి పశువుల్లో వస్తుంది. పశుపోషకులు చిన్న నిర్లక్ష్యం చేసినా మూగజీవాలు మతి చెందే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి నివారణకు జిల్లాలో ఈ నెల 20 తేదీ నుంచి లంపీ స్కిన్ వ్యాక్సినేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. జిల్లాలో 75,642 పశువులకు ఉచితంగా వ్యాక్సిన్లు వేయడం లక్ష్యం కాగా అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో పశువైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించాం. ఈ మేరకు వ్యాక్సిన్లు పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాము.

ఇప్పటి వరకు ఎన్ని వ్యాక్సిన్లు వేశారు

జిల్లాలో ఇప్పటి వరకూ సుమారు 40 వేలకుపైగా వ్యాక్సిన్లు వేశాము. ఈ కార్యక్రమం ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై పశు పోషకులకు అవగాహన కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.

వ్యాధి ఎలా సంక్రమిస్తుంది.

పశువులను ఆశించే కీటకాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వేడి, తేమతో కూడిన వాతావరణం ఉన్న నెల్లలో వ్యాధి వ్యాప్తి ఎక్కువ. జోరీగ, రక్తం పీల్చే ఈగలు, దోమలు, కొడుసుల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కొన్నిసార్లు ఈ వ్యాధి సోకిన పశువులతో ఇతర పశువులు ఉండడం వల్ల వాటికి కూడా వ్యాధి సంక్రమిస్తుంది.

వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి

పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి. అధిక జ్వరంతో బాధపడతాయి. కళ్ళ నుంచి నీరు కారడం, ముక్కు, నోటి ద్వారా రొంగలు వస్తాయి. శరీరమంతా కణితులు, బొడిపెలు, రక్తం కారి పుండ్లు ఏర్పడతాయి. పక్కటెముకలు, కాళ్లు, వెన్ను ముక, పొదుగు, కనురెప్పలు తదితర భాగాలకు వ్యాధి వ్యాప్తి చెందుతాయి. వీటి ప్రభావం 7 నుంచి 12 రోజుల వరకు ఉంటుంది. పశువులు బలహీనంగా, అలసటగా కనిపిస్తాయి. వ్యాధి సోకిన పశువులు తక్కువగా పాలు ఇస్తాయి.

చికిత్స విధానం ఏమిటి

వ్యాధి సోకిన పశువులను మిగిలిన పశువుల నుంచి వేరు చేయాలి. వ్యాధి తీవ్రత బట్టి మందులు వాడాలి. జ్వరం, కాళ్ల వాపు అధికంగా ఉంటే తగిన యాంటీ ఇన్ ఫ్లమేటరీ మందులు అందించాలి. గంతలతో కూడిన గాయాలు ఏర్పడితే యాంటీ బయాటిక్‌తో కూడిన ఆయింట్మెంట్ వాడాలి. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా పశువైద్యుని సూచన మేరకు మందులు వినియోగించాలి. హోమియో, ఆయుర్వేద మందులు తిప్పతీగ తదితర వ్యాధి నిరోధక మందులను వాడడం ఉపయోగకరం.

వ్యాధి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి

బాధ్యత పశువులను ఇతర ప్రదేశాలకు తరలించకూడదు. వ్యాధి ప్రభావిత ప్రాంతం నుంచి పశువుల వలస వెళ్లకుండా చూసుకోవాలి. కీటకాల నియంత్రణ దోమతెరలను ఉపయోగించడం, పశువుల తొట్టెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.

పాడి రైతుల సంక్షేమానికి ఏ చర్యలు తీసుకుంటున్నారు

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ఇప్పటికే గ్రామాల్లోని పశువైద్య సహాయకులను నియమించడంతో వారు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇప్పటివరకూ మూగజీవాలు అనారోగ్యానికి గురైతే రైతులు అందుబాటులో ఉన్న పశు వైద్య సిబ్బందిని సంప్రదించి మందులు వేసేవారు. దీంతో కొన్ని పశువులు కోలుకునేవి. మరికొన్ని గుర్తు తెలియని వ్యాధితో చనిపోయేవి.

పశువుల ఆరోగ్యానికి ఎటువంటి భరోసా కల్పిస్తున్నారు.?

పశువుకు సంక్రమించిన వ్యాధి ఏమిటో కచ్చితంగా తెలిసేది కాదు. వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు (లేబొరేటరీ) అందుబాటులో లేకపోవడంతో పశువులు చనిపోయి రైతులు నష్టపోయేవారు. లేబరటరీలు ఉంటే పశువులను కాపాడవచ్చని గ్రహించిన ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తద్వారా మూగజీవాల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది.


రఘుదేవపురంలో అసంపూర్తి రోడ్డు నిర్మాణం

అసంపూర్తి రహదారితో ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - సీతానగరం

రాజమండ్రి సీతానగరం నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి రూ.కోట్లు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. కాతేరు నుండి ముగ్గుళ్ళ వరకు ఇంకా పూర్తి స్థాయిలో పనులు జరగకకపోయినా కాస్త ఉపశమనం కలిగింది. ముగ్గుళ్ళ నుండి సీతానగరం రహదారి నిర్మాణం పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ అరకొర పనులతో వంతెన నిర్మాణం చేపట్టి వదిలేశారు. రాపాక వంతెన వద్ద ఏప్రిల్‌లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి యువకుడు మృతి చెందాడు. మునికూడలి, ముగ్గుళ్ళ గోదావరి మాత విగ్రహం వద్ద, రఘుదేవపురం హర్షవర్ధన్ స్కూల్ వద్ద ఇంకా పనులు పూర్తి కాలేదు. అరకొర పనులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చినుకు రాలితే రహదారి అంతా నీటితో నిండుపోయి గోతుల్లో పడి ఇప్పటికే పలువురు వాహనచోదకులు మృత్యువాత పడ్డారు. నిర్మాణ పనులు చేపట్టి వదిలేయడంతో ప్రత్యామ్నాయం లేక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గోతులు పూడ్చకుండా ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మత్తు వదల్లేకపోతున్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజాసంఘాలు కోరుతున్నారు.


బుర్రిలంక వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

జాతీయ రహదారిపై పొంచివున్న ప్రమాదం

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం బుర్రిలంక నాలుగు లైన్ల జాతీయ రహదారి చిన్నపాటి వర్షానికి ముంపుకు గురవ్వడంతో నీరు నిలిచిపోతోంది. రావులపాలెం నుంచి రాజమండ్రి వైపుకు వచ్చే వాహనదారులు నీరు కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. బుర్రిలంక వంతెన దగ్గర కొంత మేర మలుపు ఉండడంతో రహదారి వర్షపు నీటితో మునిగి ఉంటుంది. శుక్రవారం కురిసిన వర్షానికి అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. నిత్యం ఈ రహదారిపై వేలాది వాహనాలు వెళుతుంటాయి. ఈ సమస్య ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నా నేషనల్ హైవే నిర్వహణా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎంతోమంది ముంపునీటి బారిన పడి క్షతగాత్రులుగా మారారు. ఉన్నతాధికారులు తక్షణమే దీనిపై స్పందించి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని, స్థానిక రైతులు, ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

గణేశ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ నగర గణేశ ఉత్సవ సమితి సమావేశం స్థానిక గంగరాజు నగర్ 3వ వీధిలో ఆదివారం నిర్వహించారు. సమితి కో కన్వీనర్ రంబాల వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సమితి కన్వీనర్ యెనిమిరెడ్డి మాలకొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమితి గౌరవాధ్యక్షుడు పూడి రమణరాజు మాట్లాడుతూ పర్యావరణానికి హానికరం కాని జలకాలుష్యానికి గురయ్యే విషపూరిత రంగులు వాడని గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. బొలిశెట్టి వేంకట రామకృష్ణ, పెండెం సత్యనారాయణ, దిలీప్ కుమార్ సదనాని, గోడి వెంకట్, సందారి సత్తి బాబు, పితాని లీలావతి, కవికొండల చలపతి, కండిబి వెంకట్ పాల్గొన్నారు.

ఘనంగా గోవమ్మ తల్లి వసంతోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగ పంచాయితీ బాబా నగర్ సమీపంలోని గోవమ్మ తల్లి వసంతోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద పచ్చని పందిరి వేసి, చిన్నారులకు ఆటలు, పాటలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు సందడి చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సంగాని కామేశ్వరరావు, చింతా లక్ష్మణ స్వామి వర్మ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

నేటి నుంచి రద్దయిన రైళ్ల పునరుద్ధరణ

ప్రజాశక్తి - సామర్లకోట

సుమారు నెలరోజుల పైబడి దక్షిణ మధ్య రైల్వే పలు కారణాలతో రద్దు చేసిన ఎనిమిది రైళ్లను సోమవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది. మేరకు వివరాలను సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. విశాఖపట్నం కడప తిరుమల ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం గుంటూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, గుంటూరు విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, తిరుపతి విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, రాజమండ్రి విశాఖపట్నం మెమో, గుంటూరు రాయగడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సోమవారం నుండి రెండు వైపులా రాకపోకలు సాగిస్తాయన్నారు. రైల్వే ప్రయాణికులు మార్పును గమనించి సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు.

మరిడమ్మ జాతరకు యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా, శ్రావణమాసం మొదటి ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహనరావు ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు.

ముత్యాలమ్మకు ఊయల అందజేత

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి ఆలయానికి యానాంకు చెందిన సలాది జానకిరామ్ రమ్య దంపతులు ఆదివారం నాలుగు కేజీల వెండి ఊయలను బహూకరించారు. తమకు కుమారుడు జన్మించినప్పుడు నాలుగు కేజీల బరువు ఉండటంతో ఆ మేరకు అమ్మవారికి ఊయల బహుకరిస్తామని మొక్కుకున్నట్టు తెలిపారు. జానకిరామ్ తల్లిదండ్రులు యేసు, వెంకటేశ్వరరావు, సోదరుడు లక్ష్మణ్ సందీప్, బంధువులు వీళ్ళ వీర, సత్యనారాయణ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరామ్ రమ్య దంపతులు పలువురికి వస్త్ర దానం, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, పంపన విష్ణు, చంద్రరావు దంపతులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.


ప్రశంసాప్రత్రాలు అందకున్న చిన్నారులతో కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ముగిసిన కోనసీమ బాలోత్సవం

ప్రజాశక్తి-కొత్తపేట

ఆదివారం కోనసీమ బాలోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాట్లాడుతూ పిల్లలకు దేంట్లో ఆసక్తి కలదో గుర్తించి ప్రోత్సహించడానికి ఈ పిల్లల పండుగ ఒక వేదికగా ఉందని తెలిపారు. భవిష్యత్తు సమాజాన్ని చూడాలంటే నేటి పిల్లలే రేపటి బావి భారత పౌరులని, భవిష్యత్తు సమాజం నైతిక విలువలు కూడిన సమాజం కావాలంటే విద్యావంతులైన పిల్లలను తీర్చి దిద్దలన్నారు. స్కూల్ టీచర్ల సహాయ సహకారాలు, న్యాయ నిర్ణేతల సహకారాలు వల్ల పిల్లలు ప్రదర్శించిన నత్య ప్రదర్శనలు, నాటికలు, ఎంతగానో అలరించాయన్నారు. మనం ట్రస్ట్ మరియు జితేంద్ర సేవా ఫౌండేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పిల్లల పండుగ అలంరించిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కొత్తపేటలో రెండు రోజులపాటు పండుగ వాతావరణం ఏర్పడిందని అన్నారు. బాలోత్సవంలో శని, ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితయ, తృతీయ బహుమతులు మరియు విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను ఎంఎల్ఎ అందజేశారు. కోనసీమ బాలోత్సవం అధ్యక్షుడు కర్రి కాశీ విశ్వనాథం, మనం ట్రస్ట్ ఛైర్మన్ కట్టా వీరబాబు, జితేంద్ర సేవా ఫౌండేషన్ ఛైర్మన్ మట్టపర్తి జితేంద్ర, మనం ట్రస్ట్ ఇన్చార్జి యండూరి పవన్ కుమార్, గంగుమల్లరాజు, షేక్ అబ్దుల్ సత్తార్, కె.మణిలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్ర్యమంలో స్థానిక సర్పంచ్ బి.జయలక్ష్మి, భాస్కరరావు, శిల్పి రాజ కుమార్ వడయార్, మండల టిడిపి అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, పాలూరి సత్యానందం, రెడ్డి రామకష్ణ, ఎంఇఒ ఎం.హరిప్రసాద్, సత్తిరాజు ఆదిత్య కిరణ్ ,తోట వెంకటేశ్వరరావు,అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెముడులంకలో స్వామితాత ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చెముడులంకకు చెందిన సీనియర్ రాజకీయ నేత, ప్రముఖ పొగాకు వర్తకులు దొండపాటి స్వామి తాత ప్రథమ వర్ధంతి ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వామితాతతో ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకుని, ఆయన కుమారులైన వెంకట్రామయ్య, శ్రీరాములను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తమ్మన భాస్కర్రావు, మాజీ ఎంపిటిసి సభ్యుడు నాగిరెడ్డి వెంకటేశ్వర్రావు, ఆలమూరు మాజీ డిసి ఛైర్మన్, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు మల్లిపూడి ఉదయభాస్కర్రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలను అరికట్టేందుకు మీడియా సహకరించాలి

ప్రజాశక్తి-ఆలమూరు

సమాజంలో జరిగే నేరాలను అరికట్టడానికి మీడియా సహకారం తప్పక ఉండాలని, దీంతో క్రైమ్ రేట్ కట్టడి మరింత సులువు అవుతుందని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారి స్థానాల్లో ఇద్దరినీ ఆలమూరు ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపరంగా కలుసుకొని పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా శాంతికి చిహ్నామైన మొక్కలను బహుమతిగా అందించారు. క్రైమ్ తగ్గించడానికి పోలీస్ శాఖకు మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రెస్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


ఎన్.కొత్తపల్లిలో పివి.రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

పివి.రావు ఆశయ సాధకు కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా తుది శ్వాస వరకూ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పివి రావు పోరాటం చేశారని మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి అన్నారు. పివి. రావు ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఎన్.కొత్తపల్లిలో ఆదివారం పివి.రావు విగ్రహానికి మాల మహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌సి వర్గీకరణ ఉద్యమంలో అమరులైన మత వీరులకు జోహార్లు అర్పించారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. అనంతరం అమలాపురంలో వర్గీకరణపై జరిగే నిరసన కార్యక్రమానికి మాల మహానాడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మాలలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కుంచే చిన్ని, కొంకి బాలకష్ణ, నేరేడుమిల్లి సత్తిబాబు, గోసంగి శ్రీను, దోనిపాటి రాంజీ, కొంకి బాబురావు, గోసంగి సత్యనారాయణ, నల్లా రవి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలో, కె.గంగవరం మండలంలో అన్ని గ్రామాల్లో గల సర్పంచులకు ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నమని రామచంద్రపురం ఎంపిడిఒ శ్రీరామచంద్రమూర్తి, కె.గంగవరం ఎంపిడిఒ ఎన్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం నుంచి బుధవారం వరకు ఈ శిక్షణ ఉంటుందని శిక్షణలో పారిశుధ్య నిర్వహణ, చెత్త నుండి సంపద, వీధిలైట్ల నిర్వహణ తదితర కార్యక్రమాలపై ఉంటుందని గ్రామ కార్యదర్శులు ఈ శిక్షణకు హాజరు కావాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తులు ఆనందరావు

వైసిపి పాలనలో అమలుకాని అంబేద్కర్ రాజ్యాంగం

ప్రజాశక్తి-అమలాపురం

గత వైసిపి అయిదేళ్ల పాలనలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాకుండా ఎపిలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేశారని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. ఆదివారం ఎంఎల్ఎ ఆనందరరావు విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలో అంబేద్కర్ విగ్రహాన్ని రూ.178 కోట్లతో నిర్మించి, రూ.250 కోట్లు స్వాహా చేశారని విమర్శించారు. శిలాఫలకం మీద అంబేద్కర్ పేరు ఉండవలసిన చోట వైఎస్.జగన్ పేరు వేయించుకుని రాజ్యాంగ నిర్మాతనే అవమానించిన జగన్‌కు దళితులు పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. ఈ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు కూడా వైసిపి రంగులు వేసిన హేయమైన పార్టీ వైసిపి అని అన్నాయరు. ఒకటి కాదు రెండు కాదు 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి దళితులకు తీవ్ర అన్యాయం చేసింది జగనే అని ఆనందరావు అన్నారు. సంపద సష్టించాలని అంటే ప్రజలకు భారమైన పనులు వేసి వసూలు చేసింది జగనేనని ఆనందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


చెముడులంకలో నిర్వహించిన గరగోత్సవంలో పాల్గొన్న యాత్రికులు

ఘనంగా గరగోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక ప్రధాన కాలువ ఒడ్డున ఉన్న శ్రీవిజయ దుర్గ అమ్మవారి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గరగోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఆలయం నిర్మించి మూడు ఏళ్ల పూర్తయిన సందర్భముగా గ్రామంలో గరగ ఊరేగింపు, జాతర, తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి అమ్మవారి జాతర చేసేందుకు వేద పండితులు, నిర్వాహక కమిటీ నిశ్చయించినారన్నారు. 18న జాతర, 19న తీర్థ నైవేద్యాలు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నైవేద్యంలో ఎటువంటి జంతుబలి లేదని, అందరూ పాటించాలని కమిటీ స్పష్టం చేసింది. ముఖ్యంగా అమ్మవారికి బూర్లు, పరమాన్నం, వడపప్పు, పానకం నైవేద్యముగా మాత్రమే సమర్పించాలని ఆలయ కమిటీ కోరింది. కార్యక్రమంలో గురు భవాని తమ్మన వెంకటేశ్వరరావు, పాలూరి చిరంజీవి, రాయుడు వెంకటేష్ దంపతులు, అన్నందేవుల కిట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.